క్లుప్తంగా

నియామకం..


షేక్ నిషార్


నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా కురుపాం ప్రాంతానికి చెందిన షేక్ నిషార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. తనకు ఇచ్చిన ఈ పదవిని చిత్తశుద్ధి, నిబద్ధతతో నిర్వహిస్తానని, తనకు ఈ గౌరవం దక్కేందుకు గాను సహకరించిన మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు కృతజ్ఞతలని షేక్ నిషార్ తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీగా గుమ్మలక్ష్మీపురానికి చెందిన నిమ్మక గోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు విడుదల చేసింది. తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టిన పార్టీ అధిష్టానానికి, తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు బదిలీ


హెచ్ఎంకు రిలీవింగ్ ఆర్డర్ ఇస్తున్న ఎంఈఓ గౌరినాయుడు

వీరఘట్టం: మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఐదుగురు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు బదిలీ అయినట్లు ఎంఈఓ డి.గౌరినాయుడు తెలిపారు. కంబర, చిట్టపులివలస, మూలంక, వీరఘట్టం కోమటివీధి, రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలకు శనివారం రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఖాళీ అయిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంల స్థానంలో ఆదివారం స్కూల్ అసిస్టెంట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం రూ. 8,92,433


నగదు లెక్కిస్తున్న సిబ్బంది

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ హుండీలను శనివారం లెక్కించారు. ఉదయం 10 గంటలకు దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారుల సమక్షంలో ఆదాయం లెక్కించగా.. 65 రోజులకు గాను 8,92,433 రూపాయల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది ఇందిర, గ్రామ పెద్దలు, పురోహితులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి తిరువీధి


తిరువీధిలో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: దక్షిణాముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు రోజు ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో చేపట్టిన అన్నసమారాధనలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సన్మానం


సుందరరావును సత్కరిస్తున్న తహసీల్దారు బాల

గరుగుబిల్లి: ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ తహసీల్దారు బూరాడ సుందరరావును స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం సన్మానించారు. అనంతరం విధి నిర్వహణలో ఆయన కనబరిచిన చిత్తశుద్ధి, నిబద్ధతను తహసీల్దారు పి.బాల ప్రశంసించారు. ఉద్యోగ జీవితంలో ప్రజలకు మనం అందించిన సేవలే మనకు మంచి గుర్తింపునిస్తాయన్నారు. మిగతా జీవితం కూడా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామాలయ ప్రతిష్ఠ

బలిజిపేట: బర్లిలో శ్రీరామాలయ ప్రతిష్ఠ కార్యక్రమం మూడవ రోజు శనివారంతో ముగిసింది. యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాంగ దేవతామూర్తుల శ్రీసీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు.

వ్యవసాయం కరువు

- మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్
- నాడు వ్యవసాయం పండగ కాగా నేడు దండగనే భావన
- ప్రభుత్వం నుంచి అందని ప్రోత్సాహం
- అప్పులు చేయక తప్పని పరిస్థితి..

పాలకొండ రూరల్:

ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని పంటలు పండించే అన్నదాతలు ఒడిదుడుకులు ఎదురైనా వ్యవసాయంపై మక్కువతో సేద్యం చేపడుతున్నారు. వారి కష్టం గుర్తించి అండగా ఉండాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన రబీ సీజన్ అనుకూలించనప్పటికీ ఖరీఫ్ సేద్యానికి అన్నదాత సిద్ధమయ్యాడు. కూటమి సర్కారు కూడా సహకరించకపోవడంతో అప్పులు చేసి అయినా సాగు చేయాలని రైతులు భావిస్తున్నారు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడుతున్నా.. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని.. గత ప్రభుత్వ హయాంలో అయితే అన్ని విధాలా సాయం అందిందని రైతులు చెబుతున్నారు.


మదుపులు లేక పాలకొండ మండలంలో దుక్కులకు నోచుకోని పంట భూములు


అన్నదాతల సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించాలని రోడెక్కిన రైతులు, ఆయా సంఘాల నాయకులు (ఫైల్)

నాడు ముందస్తు 'భరోసా'..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండగ వాతావరణంలో సాగేది. రైతు పక్షపాతి అయిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తనం మొదలుకుని విక్రయం వరకు అన్ని దశల్లో రైతన్నకు అండగా నిలచింది. ఇందుకోసం నియోజకవర్గంలో రూ.21.25 కోట్లు ఖర్చు చేసి 93 రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పింది. 28 వేల హెక్టార్లలో 41వేల పైచిలుకు రైతులు సాగు చేస్తున్నట్లు గుర్తించి వారికి అన్ని విధాలుగా అండగా నిలిచింది. ప్రతి సీజన్‌లో అదును దాటక ముందే పెట్టుబడి సాయం 'రైతుభరోసా' వరుస ఏడాదుల్లో నేరుగా రైతు ఖాతాలకు రూ.55.83 కోట్లు జమ చేసింది. అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలు అందించేవారు. విత్తనాలు, ఎరువులు, ఇతర సాంకేతిక అంశాలు తెలుసుకునేందుకు.. లాభం వచ్చే చోట మార్కెటింగ్ చేసుకునేలా రైతుభరోసా కేంద్రాల్లో కియోస్కో యంత్రాలు ఏర్పాటు చేసింది. అలాగే వ్యవసాయ, వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్లకు మెసేజ్ రూపంలో పంపించేవారు. దీంతో వైఎస్సార్‌సీపీ పాలనలో సాగు విస్తీర్ణం పెరిగిందని రికార్డులు చెబుతున్నాయి. నేల స్వభావం, రైతు ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని విత్తనాలు సమకూర్చడంతో పాటు ఆర్‌బీకేల పరిధిలో ఐదారు గ్రామాల రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారికి అధునాతన యంత్రాలు సమకూర్చింది. ఇలా చెప్పుకుంటే పోతే ఉచిత పంటల బీమా, వ్యవసాయ అనుబంధ పాడి, ఉద్యానవన, ఇతర రంగాలకు రాయితీపై యంత్రాలు, సాగుసాయం, రుణ సాయం అందించింది. భూ యజమానులతో పాటు కౌలు రైతులకు అన్ని విధాలా గౌరవం లభించింది నాడే.

నియోజకవర్గ వ్యవసాయ సమాచరం			
మండలం పేరు	రైతుల సంఖ్య	రైతుభరోసా కేంద్రాలు	సాగువిస్తీర్ణం హెక్టార్లలో
పాలకొండ	11,208	24	8,367
వీరఘట్టం	12,809	24	9,102
సీతంపేట	13,906	29	5,108
భామిని	10,302	16	6,204

నేడు అందని సాయం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లో నాటి సంక్షేమ పథకాలను రద్దు చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాలు గాడి తప్పాయి. ఉచిత పంటల బీమా రద్దు కావడంతో పాటు పెట్టుబడి సాయంపై నేటికి స్పష్టత లేదు. వ్యవసాయ ప్రణాళిక, మండలాల వారీగా వ్యవసాయ పురోగతిపై రైతు సమన్వయ సమావేశాలు లేదు. విత్తనాలు, ఎరువుల సంబంధిత అంశాలపై ఇంతవరకు చర్చే లేదు. ఆర్‌బీకేల్లో ఉన్న గ్రామీణ వ్యవసాయ సహాయకులను(వీఏఏ) ఇతర సర్వేలకు కేటాయించడంతో వారు కూడా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. దీనికి తోడు రాజకీయ ఒత్తిళ్లు కొనసాగుతున్నాయి. పెట్టుబడి సాయం ఈ నెలలో రూ.20 వేలు వస్తుందో, లేదో తెలియక రైతులు అప్పులకు సిద్ధపడుతున్నారు. గత ప్రభుత్వ తీరు రైతును ఎంతలా ప్రోత్సహించినదీ గుర్తు చేసుకుంటున్నారు.

గరుగుబిల్లి/గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస రూరల్/కొమరాడ: అధికారంలోని కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. వారి సంక్షేమం గాలికొదిలేసింది. ఎన్నికల సమయంలో వారికి ఇస్తామన్న సాగు సాయం ఎప్పుడిస్తారన్న స్పష్టత లేదు. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ఆరంభం కానుండడంతో అన్నదాత పథకం డబ్బులు కోసం రైతులంతా ఎదురుచూస్తున్నారు. గతంలోనే బాగుండేదని, అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ క్యాలెండర్ అమలు చేసి మరీ ఏ వర్గానికి ఏ తేదీన నగదు జమ చేస్తారో చెప్పి చేశారని రైతులు అంటున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతల మాటలు నమ్మి మోసపోయామని తలలు పట్టుకుంటున్నారు. ఖరీఫ్ పనులకు పనికి వచ్చేలా సాగు సాయం అందించాలని కోరుతున్నారు.

64 వేల ఎకరాల్లో సాగు..

కురుపాం నియోజకవర్గంలోని కురుపాం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో మొత్తం ఈ ఏడాది 64 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగనుంది. ఇప్పటివరకు భూసార పరీక్షల లక్ష్యాలు 50 శాతం కూడా చేరుకోలేదు. విత్తనాలు వేయడానికి సంబంధించి, ప్రణాళికలు కూడా చేయలేదు. ఏయే రకాల విత్తనాలు ఎవరికి కావాలన్న విషయం కూడా ఎవరూ అడగలేదని రైతులు వాపోతున్నారు.


గరుగుబిల్లిలో నారుమడి సిద్ధం చేస్తున్న రైతు

రూ.20వేలు ఎప్పుడిస్తారు



ఖరీఫ్ సీజన్ దగ్గర పడింది. వర్షాలు కురుస్తున్నాయి. మడిలో దిగుదామంటే పెట్టుబడికి చిల్లి గవ్వ లేదు. మదుపులు తగ్గించేందుకు వెదలు చల్లాలంటే రెండు దుక్కులు చేయించాలి. దీనికి మూడు వేల రూపాయలకు పైనే ఖర్చవుతుంది. అలాకాకుండా నారు మడులు సిద్ధం చేయాలన్నా మరింత ఖర్చు తప్పదు. గతంలో రైతుభరోసా అందేది. నేటి ప్రభుత్వం రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటి వరకూ దీనిపై స్పష్టత లేదు. అప్పులు చేసి సేద్యం చేయాలంటే ఆందోళన తప్పదు. ప్రభుత్వం చొరవ తీసుకుని రైతుకు ఆర్థిక తోడ్పాటుతో పాటు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి.

– సుంకరి ధర్మారావు, రైతు, పాలకొండ

గతంలో సీజన్ ఆరంభంలోనే అందేది..



గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్, రబీ సీజన్‌ల ఆరంభంలోనే రైతు భరోసా డబ్బులు వేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇస్తానన్న అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు ఇస్తారన్న స్పష్టత లేదు. ఏటా రూ.20 వేలు ఇస్తానన్నారు.. అవి ఇస్తే సాగు పెట్టుబడికి పనికి వస్తుందని రైతులమంతా ఎదురుచూస్తున్నాం. ఈ ఏడాది కష్టాలు తప్పేవి లేవు.

-కె.అవినాష్, గిరిజన రైతు సంఘం నాయకుడు, ఇరిడి, గుమ్మలక్ష్మీపురం

పథకం జాడేదీ..?



ఖరీఫ్ సీజన్ మరి కొన్నిరోజుల్లో ఆరంభం అవుతుంది. ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం జాడే లేదు. ఎప్పుడు ఇస్తారన్న విషయం కూడా తెలీదు. పంటల బీమా, వ్యవసాయ యంత్రాల పంపిణీ కూడా ఇంతవరకు జరగలేదు. రైతలమంతా అప్పులు చేసి మరీ పంటలు పండించాల్సిన పరిస్థితి.

-బి.సత్యనారాయణ, గెద్దతిరువాడ, జియ్యమ్మవలస

ఐదో తేదీ లోపు రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

వీరఘట్టం: ప్రతి నెలా ఐదో తేదీ లోపు రేషన్ సరుకుల పంపిణీ పూర్తి చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులందరికీ రేషన్ సరుకులు అందించాలన్నారు. మండలంలో మొత్తం 56 డిపోల పరిధిలో 19,816 రేషన్ కార్డులు ఉన్నాయని, ఇందులో 2,774 మంది దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన వారు ఉన్నారని, వారందరికీ ఇంటికెళ్లి రేషన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు డిపో తెరిచి ఉండాలన్నారు.


రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

ఖైదీలకు అన్ని వసతులు కల్పించాలి

- లీగల్‌సెల్ సర్వీసెస్ చైర్‌పర్సన్ హరిప్రియ

పాలకొండ: రిమాండ్ ఖైదీలకు ప్రభుత్వం కల్పించిన అన్ని వసతులు అందించాలని మండల లీగల్ సెల్ సర్వీసస్ చైర్‌పర్సన్ సీహెచ్ హరిప్రియ సూచించారు. శనివారం స్థానిక సబ్ జైల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ.. అక్కడ అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. రుచికరమైన భోజనం అందించాలని, ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ జోగులు, న్యాయవాదులు కె.రవి, శ్యామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.


సబ్ జైల్‌లో ఖైదీలతో మాట్లాడుతున్న హరిప్రియ


యోగాసనాలు వేస్తున్న వైద్య సిబ్బంది

యోగాతో ఆరోగ్యం

పాలకొండ రూరల్ : క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించి మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని యోగా శిక్షకుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా పాలకొండ డివిజన్ పరిధిలోని 430మంది హైల్త్ సిబ్బంది, వైద్యాధికారులకు శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. యోగాలో ఎంతో ప్రాచుర్యం పొందిన సూర్య నమస్కారాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు.

పొగాకు రహిత సమాజాన్ని స్థాపిద్దాం..



ర్యాలీ చేపడుతున్న హెల్త్ సిబ్బంది

పాలకొండ రూరల్: పొగాకు రహిత సమాజ స్థాపన ద్వారా ఆరోగ్య లబ్ధి పొందవచ్చని ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ కడియం చిరంజీవి అన్నారు. ప్రపంచ పొగాకు నివారణ దినం పురస్కరించుకుని శనివారం స్థానిక పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు వాడకం వలన కలిగే అనర్థాలను గుర్తించి వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొగ్రమింగ్ అధికారి యేగేశ్వరరెడ్డి, నర్సింగ్ సూపరింటిండెంట్ సోఫియా సౌదామిని, ఆశా, అంగన్‌వాడీ, హెల్త్ వర్కర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు అవగాహన ర్యాలీ చేపట్టారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని గిరిశిఖర పంచాయతీ గ్రామాలు టీకే జమ్ము, అలమండ, అర్నాడ గ్రామ సచివాలయాలను ఎంపీడీవో కె.ధర్మారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సచివాలయాల పరిధిలో జరిగిన పింఛన్ల పంపిణీని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛన్లు అందివ్వాలని, సమయపాలన పాటించాలని ఎంపీడీవో తెలిపారు.

నేటి నుంచి డిపోల వద్దే రేషన్ పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: రేషన్ డిపోల వద్దనే ఆదివారం నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎన్.శేఖర్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. మండలంలో మొత్తం 24 రేషన్ దుకాణాలు ఉన్నాయని, వాటి పరిధిలో 1,899 రైస్‌కార్డులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెల నుంచి ప్రతినెలా చౌకధరల దుకాణం వద్దనే రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్డుదారులు గమనించి, రేషన్‌షాపుల వద్దకు వెళ్లి, నిత్యావసర సరుకులు తీసుకోవాలని తెలిపారు.

ఆదర్శనీయురాలు అహల్యాబాయి

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అహల్యాబాయి హోల్కర్ జయంతి శనివారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు తదితరులంతా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలు కొనియాడారు. రాణిగా ఆమె ప్రజలకు అందించిన సుపరిపాలన, సైన్యాన్ని ముందుండి నడిపించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె గొప్ప ఆదర్శనీయురాలని, భవిష్యత్ తరాల వారు ఆమెను ఆదర్శంగా తీసుకుని ముందుకునడవాలని కోరారు. సామాజిక సంస్కరణ, మహిళా సాధికారతకు ఆమె చేసిన కృషికి గాను భారత ప్రభుత్వం స్త్రీశక్తి పురస్కారం నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ ప్రారంభోత్సవాలు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేటలో కొత్తగా నిర్మించిన సీతారామ ఆలయ ప్రారంభోత్సవాలు శనివారం ముగిశాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రారంభం, విగ్రహ, యంత్రశిఖర ప్రతిష్ఠ తదితర పూజలు చేశారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం వంటి కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, 3 వేల మందికి అన్నప్రసాదం వితరణ చేశారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విక్రాంత్, కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎమ్మెల్సీ పాలవలస, మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ జూన్ నాలుగో తేదీన వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఈమేరకు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అధికారం కోసం తప్పుడు హామీలిచ్చిన కూటమి నాయకులు వాటిని నిలబెట్టుకోవాలన్నారు. మోసపోయిన ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీపై ఉందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనకు.. కూటమి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు వివరించాలని సూచించారు. నాలుగో తేదీ ఉదయం పది గంటలకు వైఎస్సార్‌సీపీ కూడలి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు.

జీపుజాతా ప్రారంభం

సీతంపేట: మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పరిధిలోని పోస్టులను మినహాయించాలని ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోత రామారావు, కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు చేపట్టనున్న జీపుజాతాను స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల నాలుగో తేదీ వరకు జీపుజాతా కొనసాగుతుందని చెప్పారు. ఏజెన్సీలో ఉపాధ్యాయ పోస్టులకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని కోరారు. అలాగే ఉద్యోగాలను కూడా కేవలం గిరిజనులతో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎల్.రాంబాబు, ఎ.భాస్కరరావు, బి.అప్పారావు, ఎం.తిరుపతిరావు, పి.సాంబయ్య, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.


జీపుజాతా ప్రారంభిస్తున్న నాయకులు

పండగ దృష్ట్యా వాహనాల దారి మళ్లింపు

పార్వతీపురం రూరల్:

జిల్లా కేంద్రంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ తల్లి గ్రామ దేవతల పండగలను పురస్కరించుకొని భక్తుల రద్దీ దృష్ట్యా జూన్ 3 మంగళవారం సిరిమానోత్సవం రోజున సాయంత్రం 5గంటల నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు భారీ వాహనాలను జిల్లా కేంద్రానికి ఇరువైపులా సరిహద్దు ప్రాంతాలైన నర్సిపురం, అర్తాం గ్రామాల సమీపంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై రాకపోకలు చేసే వాహనాలను నిలిపివేస్తున్నట్టు పట్టణ సీఐ కె.మురళీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను పార్వతీపురం బైపాస్ రోడ్డు మీదుగా పాలకొండ వెపు వెళ్లే వాహనాలను, అలాగే రాయగడ వైపు వెళ్లే వాహనాలను చంద్రంపేట, కొత్తవలస మీదుగా మళ్లించేందుకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ఆయన తెలిపారు. సిరిమానోత్సవం సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి లోపలకు వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు బైపాస్ మార్గం ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు. అలాగే సిరిమాను తిరిగే వీధుల్లో ఇళ్లముందు వాహనాలను పార్కింగ్ చేయకూడదని సీఐ సూచించారు.